కవర్లు అయ్యన్నీ బయటికి తీసి అది ఏ కవరు తాలూకుదో చూసి ఆ కవర్లో పెట్టాలంట ఎంత రాత్రయినా సరే ఈ పని చేసి మరీ వెళ్లాలంట. అందుకని మీ ఆరుగురు కోడింగాఫీసర్లని పంపించమని మీకు చెప్పమన్నారు అయ్యగారు. ఆకర్న వెళ్లిపోయేటప్పుడు కొంటరు పాయిలు లూజుగా ఎందుకు కింద పడిపోయిందో ఆ ఫలానా ఆఫీసర్ గారు రాసివ్వాలంట కూడాను" అన్నాడు

స్కూటరెక్కబోతూన్న అందరం పెంకెగా, "ఇవ్వాళే చెయ్యాలా, టైమయిపోయాక ?. రేపు చేస్తాం" అన్నాడు . ...." ఇయ్యాల చెయ్యకపోతే రేపు రిలీఫిచ్చి ఇంటికి పంపేత్తారంట మీ ఇట్టం!" ప్యూను వెళ్ళిపోయాడు.

టక్కున స్కూటరు దిగాడు అందరం మందరం, కందరం,ఇందరం, ఎందరం, కొందరం-అందర్నీ తలా ఒక స్థితిలో ఉన్న వాళ్ళని పోగు చేశాడు తుమ్మల్లో పొద్దుగూకినట్టున్న మొహాల్తో ఆ ఆరుగురూ న్యూక్లియస్ రూము వైపు కదిలారు

నిట్టూర్చి, కదిలి బస్సెక్కాడు నిష్కళంకం

(ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక 20-8-85)

*** *** ***

# వారెవా వడ్డాణమా !

స్ప్రింగ్ డోర్ లోసుకుని లోపలికి నడిచాడు బాంకాఫీసర్ భూపతి లోపలున్న బాంక్ మేనేజర్తో " సార్, వడ్డాణం విడిపించుకోవటానికి పార్టీ వచ్చాడు. మీ రొక సారొస్తారా?" అన్నాడు.

మేనేజర్ సింహశౌర్యం చేతుల్లోంచి ఫైలు అప్రయత్నంగా జారి టేబిలుమీది కొరిగింది. అతను అన్నాడు. "నేనిక్కడ చార్జీ తీసుకుని వారం కూడా కాలేదు. అప్పుడే గోల్డు లోను కేసేంటి ! పది రోజుల తరవాత రమ్మను. కావలిస్తే డబ్బు కట్టెయ్యమను."

" ఆ వచ్చింది కాలేజీ లెక్చరరు గారు సార్ నా(ఫెండు. ఇప్పటికే రెండు మూడు సార్లు తిరిగెళ్లేడే" అన్నాడు భూపతి సింహశౌర్యం తన తల పట్టుకున్నాడు. కళ్లు మూసుకున్నాడు. నుదురు నొక్కుకున్నాడు అసహనంగా అటూ ఇటూ కదిలాడు కాలింగ్ బెల్ నొక్కాడు అటెండర్ రాగానే మంచినీళ్లు తెమ్మన్నాడు. అతను తెచ్చాడు. ఇంత నేపూ భూపతి డోర్ దగ్గరే నుంచున్నాడు సింహ శౌర్యం ఆ నీళ్లు తాగలేదు. నీరసంగా భూపతి వైపు చూస్తూ " మాట, ఇటొచ్చి కూర్చో" అన్నాడు.

పరిస్థితేంటో అర్థం కాలేదు భూపతికి వెళ్లి సింహశౌర్యానికెదురుగా కూర్చున్నాడు

సింహశౌర్యం అన్నాడు " చూడుబాబూ, ఏదో ఆ అడ్వాన్సు, ఈ అడ్వాన్సూ అయితే ఫరవాలేదు. కానీ, ఈ గోల్డులోనుండే, ఇది తలకొరివి, ఇదంటే నా కసలు ఎలర్జీ. దీని పేరు వింటేనే నాకు ఒళ్ళు జలదరిస్తుంది. ముచ్చెమటలు పోస్తాయి మా అమ్మా నాన్నా జ్ఞాపకం వస్తారు. నాభార్య పిల్లలూ నాకళ్ళముందు తారట్లాడుతారు. బాబూ, ఏ గోల్డుకి ఎవరు అసలు యజమానులో తెలుసుకోవటానికి అంటే ఊళ్ళో వాళ్లతో పరిచయం అవటానికి నాకో పది రోజులు పడుతుంది. అప్పటి దాకా గోల్డు లోను

మనం పెట్టుకోనూ వద్దు, వదిలి పెట్టనూ వద్దు! సర్వీసులో ఢక్కామొక్కీలు తిన్నవాణ్ణి నేను చెప్పినట్టువిను! నెల్లోజుల్లో నువ్వే ఒక మేనేజరువి కాబోతున్నావు క్రమంగా నీకే అన్నీ అర్థమవుతాయి''

భూపతి అర్థం కానట్టు అయోమయంగా మొహం పెట్టాడు సింహశౌర్యం '' అర్థం కాలేదు గదూ! సరే ఈ కథ విను!'' అన్నాడు చెప్పటం మొదలు పెట్టాడు

★ ★ ★

గండాలగూడెం బాంకులో ఉద్యోగులంతా బదిలీమీద కొత్తగా వచ్చి చేరినవాళ్లే. లోన్లు సెక్షను ఆఫీసరు ఐరావతం వాళ్లలో ఒకడు

పందెపు గుర్రంలాగా మంచి వయస్సులో మిసమిసలాడుతున్నయువతి ఒకర్తె ఐరావతం దగ్గరకొచ్చింది తన పేరు చకోరి అనీ, తన భర్త చంద్రారావు పూర్వ మెప్పుడో తన వడ్డాణం ఆ బాంకులో పెట్టి డబ్బు అప్పు తీసికెళ్ళాడనీ, ఆ వడ్డాణం తనిప్పుడు విడిపించుకోబోతున్నాననీ డబ్బెంత కట్టాలో చెప్పమనీ అంది.

ఐరావతం కాగితాలు తీసి లెక్క కట్టాడు. '' పదిహేను వేలు కట్టాలి.. అయినా పెట్టింది చంద్రారావుగారే కనక విడిపించుకోటానిక్కూడా ఆయనే రావాలి.'' అన్నాడు.

చకోరి కంగారు పడింది విచారంగా '' ఆయన పోయారండి ఇప్పుడెట్టాగండి?''... '' ఆయన పోయినట్టు డెత్ సర్టిఫికెట్టూ, ఆయనకివారసులు మీరేనని చెప్పే లీగల్ హెయిర్ సర్టిఫికెట్టూ తీసుకురండి. అప్పుడే వడ్డాణం మీదవుతుంది''

దిగులుగా చూసింది చకోరి మెల్లిగా బయటికి నడిచింది.

డెత్ సర్టిఫికెట్ మాత్రం తీసుకునివారం తరవాత మళ్ళీ వచ్చింది. '' ఇంకో కాగితం తర్వాత తెస్తాలెండి. ఇప్పటికీ కాగితమూ, డబ్బు తీసుకుని నా వొడ్డాణం నా కిప్పించండి' అంది.

'' అట్టాంటే కుదర్దు. రెండో కాగితం కూడా తెస్తేనే వడ్డాణం ఇస్తాం.'' అన్నాడు ఐరావతం.

'' అదేంటో నాకు సరిగా తెలీలేదండీ.'' ... '' అది మీకు తెలీకపోతే వస్తు వెవరికివ్వాలో మాకు తెలీదు.'' చకోరి ఏడుపు మొహం పెట్టేసింది. బతిమాలటం మొదలెట్టింది. '' బాబ్బాబూ డబ్బు కట్టించుకుని నా వొడ్డాణం నాకిచ్చెయ్యండి ఆ చచ్చినోడు పైసా మిగల్చకుండా చచ్చాడు. అణ్ణి కట్టుకుని పుట్టింటోళ్ళ గ్గూడా దూరమైపొయ్యాను. ఆళ్లు నా కిచ్చింది సెంటు భూమి లేదు రూపాయి డబ్బులేదు. లక్ష రూపాయల వొడ్డాణం ఇది. దీనికోసం నాచేతి గాజులమ్మి ఈ డబ్బు తెచ్చాను. బాబ్బాబూ నాది నా కిప్పించండి. నా బతుకంతా దీంతోనే ఉంది. ఇది నాకు దక్కకపోతే నాకు తిండిలేదు. నేనడుక్కుని తినాల్సిందే.లాపోతే ఏ నుయ్యో, గొయ్యో చూసుకోవాల్సిందేః... ఒరి దేవుడో ఎట్టా బతకాల్రా నాయనో'' చకోరి సన్నగా ఏడుపు మొదలు పెట్టింది.

ఐరావతం కొంచెం చలించాడు. కానీ, వెంటనే నిలదొక్కుకున్నాడు '' ష్ ఇది బాంకు. ఏడవకు ఏ మాత్రం అవకాశమున్నప్పటికీ నీ వొడ్డాణం నీ కిచ్చేసేవాణ్ణే! నేనేం చెయ్యను. రూల్సు అట్లా ఉన్నాయి మరి! అద్సరే పుట్టింటి వాళ్లు దూరమైతే అత్తింటి వాళ్ళేమయ్యారు? అసలు మీ అత్తారిదే ఊరు?''

చకోరి ఏడుపాపింది. నెమ్మదిగా , ''అఁ అళ్ళోహముదనష్టపోళ్లు లెండి!'' అని అంటూనే మళ్ళీ అంది, '' మీసాలప్పలసామని పతివ్రతలపాడులెండి. అసలు పేరు తంటసం అప్పలసామి పాతికెకరాల యవసాయం అదీని! మా ఆయనకి సెంటుగూడా ఇచ్చాడుగాడు యెదవన్నర యెదవ!''

'' సర్లెండి. మా కవన్నీ అనవసరం. పోనీ డబ్బు తెచ్చారు గనక ఇప్పుడు అప్పుడు తీర్చేయండి.

వొడ్డాణాన్ని భద్రంగా లాకర్లో దాస్తాం. వారసత్వ సర్టిఫికెట్టు తెచ్చినప్పుడు మీ కిచ్చేస్తాం.''

చకోరి చురుక్కున చూసింది మొహంలోంచి తెలివితొంగి చూస్తూండగా అంది. '' వొడ్డాణాన్ని లాకర్లో పెట్టే కాడికిప్పుడు డబ్బు కట్టడం దేనికండి! ఆ కాయితమేదో తెచ్చాకే కడతా లెండి!'' పెడసరంగా చూస్తూ మూతి విరుస్తూ విసవిసా వెళ్ళిపోయింది చకోరి

ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోయాడు ఐరావతం.

పది రోజుల తరవాత ఏవేవో ఇతర అప్పుల వసూళ్లకని జీపుమీద పతిర్వతలపాడు కెళ్లినైరావతం. చకోరి విషయం జ్ఞాపకాని కొచ్చి పన్లో పని వెతుక్కుంటూ మీసాలప్పసామిఇంటికెళ్ళాడు. పేరుకు తగ్గట్టుగానే మీసాలప్పలస్వామి పెద్ద పెద్ద గుబురు మీసాల్తో భారీ విగ్రహంతో, నోట్లో జానెడు పొడుగు చుట్టతో భయంకరంగా ఉన్నాడు. పెంకుటింటివసారా అరుగుమీద కుర్చీలో కూర్చుని గుప్పుగుప్పుమని పొగ వదుల్తున్నాడు.

ఐరావతం జీపు దిగెళ్ళి అతన్తో పరిచయం చేసుకున్నాడు. '' మీ అబ్బాయి మా బాంకులో వడ్డాణం పెట్టాడు గదా. దాన్ని విడిపించుకోడానికి పదిహేను వేలతో కోడలు చకోరి గారొచ్చారు. మీ అబ్బాయి చనిపోయార్టగదా!''

మీసాలప్పలసామి నోట్లోంచి చుట్టకిందికి జారిపోయింది. నిలువు గుడ్లేసుకుని చూస్తూండ పోయాడు. '' వొడ్డాణం ఇచ్చేశారా?'' అంటూ అతను నోరు తెరిచేశాడు.

'' లేదు. వారసత్వం సర్టిఫికెట్టుగాని, ఆస్తి దఖలు దస్తావేజుగాని తెమ్మన్నాము.''

'' దాని శార్థం! అదెక్కడ తెచ్చుద్ది! అయినా, ఆ నాకొడుకు ఆ వొడ్డాణం మీ కాడుంచి చావటమేంటంట! సరే ఇప్పుడు నా కందులో వాటా వచ్చుద్ది... అహఁహఁ అసలది నాదే. నాదేనండి! అప్పు నేను కట్టేస్తాను. నాకిచ్చెయ్యండి.''

ఐరావతం తెల్లబోయాడు. '' అదేంటి, అది మీ కోడలు వస్తువు గదా మీ కెట్లా వస్తుంది?''

మీసాలప్పసామి ఉగ్రుడైపోయాడు. కుర్చీలోంచి లేచి అరుగు దిగి ఐరావతం దగ్గరకొచ్చి నుంచున్నాడు. '' కోడల్దా, కొరివిదా! తొత్తు కూతురు ముండ. అది నాదండీ నాది! నా స్వార్జితం! నా కాడ దాస్తానియ్యాయ్యా అంటే అడి కిచ్చాను. మాదచ్చోద్ నా కొడుకు. అది మీ కాడుంచి గుటుక్కుమంటాడని నాకేం తెలుసు! ఇదిగో ఏవయ్యోయ్ . ఆఫీసరుగారూ, పాతికెకరాల మోతుబరిని! ఫిర్కాలో మాటకి తిరుగులేనోణ్ణి! ఆ వొడ్డాణం నాదంటున్నాను. కనక అది నాకే చెందుద్ది! ఇంకెవురికయినా ఇచ్చారో చూస్కోనేనసలే పెద్దమడిసిని.''

సింహద్వారం తలుపు ఓరవాకిలిగా వేసుంది. ఆ ద్వారంలో మండిగం మీద కాలు పెట్టి నుంచొని ఒక స్త్రీ బయటికి తొంగి చూస్తూంది అలా చూసి చూసి లోలికి తప్పుకుంది. అది గమనించాడు ఐరావతం.

ఐరావతం కొంచె బెదిరాడు అయినా, ధైర్యంగా అన్నాడు. '' వారసత్వం ఎవరి కొస్తే వాళ్ళకిస్తాం.. ఈ బెదిరింపేంటి!''

'' చాల్చాల్లేవయ్యా! ఎంత మాదచ్చోదయినా అడు నా కన్నకొడుకే నేనాణ్ణి కన్నోణ్ణి. ఇంతకన్నా వారసత్వమేంటి! నేనియ్యకపోతే అడికి డబ్బెక్కిడిది, బంగారు మెక్కడది! అడేమన్నా కలెక్టరు గిరీ చేశాడా, మంత్రిగిరి యెలగబెట్టాడా? ముదనష్టపెదవ! పోయిపోయి ఆలాడ్జింగులో చావకపోతే ఇంత పోగాలా ఉంది, ఈడకొచ్చి చావరాదు! సరే, ఆకరిగా చెబుతున్నా, రెండ్రోజుల్లో బాంకు కొచ్చి డబ్బు కట్టేస్తాను. ఆ వొడ్డాణం నా కిచ్చేసి యెవ్వారం ఫైనల్ చేసెయ్యి. లాకపోతే నేనసలే మంచోణ్ణి జాగర్త!''

ఐరావతం అవాక్కయిపోయాడు. క్షణం ఆక్కుండా జీపెక్కాడు. మరుక్షణం అక్కణ్ణుంచి కదిలిపోయాడు. జీపు కొంచెం ముందు కెళ్ళి సందు మలుపు తిరిగి మీసాలప్పలసామి గొడ్ల దొడ్డి గుమ్మంముందు కెళ్ళేసరికి ఇందాకన తొంగి చూసిన ఆడది ఆ దొడ్డి గుమ్మంలోంచి ఒక్క దూకు దూకి జీపు కడ్డం నుంచుంది. జీపాగింది. ఆమె ఐరావతం పక్క కొచ్చి " బాబూ ఓపాలి గుమ్మంలో కొస్తారా?' 'అంది 'ఒద్దు ఒద్దు' అనుకుంటూనే ఐరావతం జీపు దిగి ఆమెతో దొడ్డి గుమ్మంలో కెల్లి బంతి మొక్కల దగ్గర బాదం చెట్టునీడలో నిలబడ్డాడు. " ఏంటండీ బాబూ, వొడ్డాణమూ మాయబ్బాయి బాంకులో పెట్టి చచ్చిపోయ్యిందేనా? అది తుప్పతల్లంజ ఆచకోరీది కాదు, తుప్ప మీసాలోడు యీడిది కాదు. అదస్సలు నాది. నా కార్యమప్పుడు నాపుట్టింటోళ్ళు పెట్టింది. నేనే నా కొడుక్కిచ్చి దాయరా యెదవా అన్నాను, దీనకి సాక్షీకం లేదుగా అందుకని ఆడు జావగానే దాన్జిమ్మడ దాని మొదలార, ఆ చకోరి లంజ యెగబడతా ఉంది, ఈ ముసలాడంతకన్నా, ఈడి దివసం బెట్టుగుంటానికి మల్లే అదాడిదేనంటన్నాడు! అదచ్చంగా నాదేనండి బాబూ! దేవుడిమీదొట్టు! బాబ్బాబు! ఆడదాన్ని! పుట్టింటోళ్ళు పెట్టిందేగదా బాబూ ఆడదానికి మిగిలేది! నన్నన్నాయం జెయ్యకండి! డబ్బు తీసుకుని రేపో మాపో బాంకు కొస్తాను. నాది నా కిచ్చెయ్యండి."

" చూడమ్మా ఆ వొడ్డాణం మీ ముగ్గుర్లో ఎవరిదో తెలీదు గానీ, నాది మాత్రం కాదు. కనక అదెక్కడికీ పోదు కంగారేం లేదు. తాపీగా రండి! వారసత్వ రుజువులు తీసుకురండి. ఎవరు తెస్తే వారికిస్తాం అప్పటిదాకా నన్నూదరగొట్టకండి. అమ్మా. అదీ సంగతి!" ఐరావతం కదలబోయాడు.

ఆమె చటుక్కున అతని కడ్డం వెళ్లింది " యావయ్యోయ్, నా పేరేందో తెల్సా మహంకాళి! నేను యిజ్రుంభించానంటే యవ్వారం అంతా తలకిందులై పోద్ది నాకైదుగురున్నారు. జాగర్త?" అంది.

ఐరావతం అమాయకంగా అన్నాడు " అయిదుగురా ఎవరు?" ... అంత కోపంలోనూ మహంకాళి నవ్వబోయింది. పంటి నొక్కుతో ఆపుకుంది. ఓరగా చూస్తున్నట్టు అంటూనే మళ్ళీ విసురుగా " అళ్ళు నా తోడబుట్టినోళ్ళు! అళ్ళగ్గనక చెప్పానంటే అంతా వొచ్చి ఆ వొడ్డాణం ఇచ్చేదాకా బాంకు ముంగల నిరసన వ్రతం కూచుంటారు. ఆళ్లెనకమాల నేను కూచుంటాని. ఇహ జూస్కో కద నడిపిస్తాం! అంచాత మర్యాదగా రేపు నేను రాంగానే నాది నా కిచ్చెయ్యక పొయ్యావో జాగర్త!"

ఐరావతం రెండోసారి ఎగిరి జీపులో పడ్డాడు. జీపు అర నిముషంలో పతివ్రతలపాడు ఊళ్ళో నించే మాయమయింది.

ఐరావతం తన బ్యాంకు మేనేజర్తో జరిగిన విషయమంతా చెప్పాడు.... అంతా విన్న మేనేజరు పకపకా నవ్వాడు " నువ్వొట్టి పేరుకు మాత్రమే ఐరావతానివయ్యా! సర్లే భయపడకు! రూల్సు పాటించినంత కాలమూ మనకే ఇక్కట్లూ రావు. ఎవరయినా నీమీది కొచ్చారో , నాదగ్గరికి పంపించు. నేన్చూసుకుంటా! అసలు నన్ను చూడు అడ్వాన్సుల వసూళ్ళ కెళ్ళినప్పుడు ఎవరెంతగా బెదిరించినప్పటికీ పట్టించుకోకుండా ధైర్యంగా ఉంటున్నా! ఏం కుర్రాళ్ళయ్యా మీరు! చీర్‌ఫుల్ మైబోయ్!" అన్నాడు గర్వంగా తన ములక్కాడ మీసాలనో సారి మునివేళ్ళతో ముట్టుకున్నాడు

ఆ తరవాత నాలుగు రోజులికి, రోజుకొకరు చెప్పిన చకోరీ, మీసాలప్పలసామీ, మహంకాళీ ఒకళ్ళకి తెలియకుండా ఒకళ్ళు బాంకు కొచ్చారు మేనేజర్ని కలిశారు. గంభీరంగా అతను అందరికీ ఒకే మాట చెప్పాడు " వారసత్వం రుజువులు ఎవరు తెస్తే వాళ్లకే ఇస్తాం. కావలిస్తే మేమిల్లా అంటున్నామని కోర్టులో దావా వేసుకోండి. అనవసరంగా అల్లరి చేస్తే సహించం. జాగర్త!"

వాళ్ళళ్ళో ప్రతి ఒక్కరూ బతిమాలి బతిమాలి చేసేదేంలేక చివరికి జారుకున్నారు. ఊళ్లో

శ్రీరామనవమి ఉత్సవాల కమిటీ ఏర్పడింది. హరికతలు, తోలుబొమ్మలాటలు కోలాటాలు, బృందనాట్యాలు వగైరా కార్యక్రమాలు భారీ ఎత్తున చెయ్యటంలో వాళ్ళు తల మునకలవుతున్నారు. బాంకు వాడనే మోజుతో వాళ్ళు ఐరావతాన్ని కూడా సభ్యుడుగా వేసుకున్నారు. ఈ బాధ్యత కారణంగా ఐరావతం అయిదు రోజులు బాంకుకు సెలవు పెట్టాడు.

కనక ఐరావతం బాధ్యత తను తీసుకుని మేనేజర్ అప్పుల వసూళ్లకి ఒకటి రెండు సార్లుపతిత్రవతల పాడు ప్రాంతాల కెళ్ళొచ్చాడు.

★ ★ ★

ఓ రోజు రాత్రి ఆఫీసరు ఐరావతం శ్రీరామనవమి పందిరి వైపు రిక్షాలో వెడుతుండగా,పందిరింకా యాభైగజాల దూరంలో ఉందనగా, సినిమా స్టార్ లాగా అలంకరించుకొని గుమ్మంలో నిలబడ్డ అమ్మాయి ఒకత్తె అతని దృష్టిలో పడింది. అతను తేరిపార చూశాడు. చకోరి! ఈ లోపల చకోరి కూడా అతన్ని చూసింది. చటుక్కుని రిక్షా కడ్డం వచ్చింది. " బాబూ, యామనుకోకపోతే చిన్న మాటే! ఒక్క నిమిషం! లోపలికి రండి, ప్లీజ్ " అంది. ఐరావతం అయిష్టంగానే రిక్షా దిగాడు. లోపలి కెళ్ళాడు కుర్చీలో కూర్చున్నాడు. చకోరి ఏదోకాగితం పట్టుకొచ్చి అతని కిచ్చి " ఇదేగా మీ క్కావాల్సింది!" అంది.

ఐరావతం , "ఆహాఁ, ఇది కాదు, రిజిస్ట్రార్ ఇవ్వాలి. " అన్నాడు.

చకోరి చటుక్కున లోపలికెళ్ళింది. కాఫీ పట్టుకొచ్చింది. అతని కెదురుగా పెట్టింది. అతని పక్కకొచ్చి నించుంది అతని చేతిమీద తన చేత్తో మృదువుగా నిమిరింది." ఆడా సొయ్యాడు! లోకమాదిక్కుమాలింది! వొయిస్సా ఉత్త చెత్కారీది! నేనేమయిపోవాలి జెప్పండి! తిండి గడిచేందుకు మరాముల్లు పడకోకుండా ఆ వొడ్డాణం ఉంటే చాలు, ఏదో మీలాంటి సరసం ఆఫీసర్ల యిలాకాలో బతుకు యెళ్ళమార్చుకుందా మనుకుంటున్నాను." అంటూ తన చెంపని అతని చెంపకేసిరాసీ రాయనట్టు రాసి చటుక్కున పోయి అతని కెదురుగా కూర్చుంది. మోకాళ్ళ మీద చేతులు పెట్టుకుని వంగి అతని కళ్ళలోకి చిలిపిగా చూసింది నవ్వింది.

ఐరావతానికి వెంట్రుకలు నిక్కబొడుచుకొన్నాయి. రక్తం సర్రున వేడెక్కింది. మరు క్షణంలో గుండె దడ హెచ్చింది. అతను హడలెత్తిపోయాడు. చట్టుక్కున లేచాడు. బయట కెళ్ళబోయాడు. పక్క గుమ్మంలోంచి మహంకాళి రంయ్‌నొచ్చింది అంది? " బాబూ, ముసుగులో గుద్దులాటెందుకు?మాలో మేం రాజీ కొచ్చేశాం మూడైదేలు కట్టేస్తాం. మాలో ఎవరి కిచ్చినా సరే వొడ్డాణం మీపేరు చెప్పుకుని మేం పంచుకుంటాం. ఊరికే ఇవ్వద్దులెండి... అయిదువేలిస్తాం.. పోనీ ఆరువేలు... ఆలోచించండి!"

ఐరావతం ఆమె నొక్క తోపు తోసి నడిచాడు బయటి గుమ్మంలోంచి మీసాలప్పలసామి లోపలి కొస్తూనే ఐరావతాన్ని కుర్చీలో వెనక్కి కూలదోసేశాడు కోపంగా అన్నాడు. " నువ్వు మా వూరు రెండుసార్లొచ్చావంట, ఎవురెవురిళ్ళకో యెళ్ళి ఎంక్వయిరీ చేశావంట, నిజమేనా?"

"ఊఁ... వెళ్ళాను. వెడితే ఏంటి?" . " యావయ్యోయ్, పెద్ద పోటాఫీసరన్నునుకుంటాన్నావేమో! మా ముగ్గుర్లో ఎవరికోరికి వొడ్డాణం యిచ్చావా సరే. మాక్కాకోకండా ఇంకెవురికన్నా యిచ్చావంటే మాత్రం నీ దుమ్ము దులగదీసెయ్యగల్ను! పెళ్ళాం బిడ్డలున్నోడివి, పెద్దోడివి, అన్యాయమై పోగలవు. జాగర్త!" అలా అంటూ గుమ్మం వైపు చూపించాడు మీసాలప్పలసామి

చూశాడు ఐరావతం, గుమ్మంలో ఇద్దరు రౌడీలు నుంచొన్నారు

అంత బెదురులోనూ ఐరావతానికి కోపం నసాళం అంటింది. మీసాలప్పలసామినీ తోసేసీ గుమ్మంలోకి రాబోయాడు. అంతే! ఆ అయిదుగురూ కలిసి అతని మీద పడ్డారు! చేతి కొచ్చినట్టు

దబదబా బాదేశారు!

రెండు నిముషాల తర్వాత చిరిగిన చొక్కాతో పగిలిన వాచీతో, విరిగిన కళ్లజోడుతో తొలిగిన గూళ్ళతో ఎట్లాగో ఐరావతం వీధిలో కొచ్చిపడ్డాడు! ఇంకెట్లాగో తన కొంపకి చేరాడు!

★ ★ ★

మానేజర్ సింహశౌర్యం కథ చెప్పడం ఆపాడు " అదయ్యా వొడ్డాణం లోను కథ!" అన్నాడు. భూపతి తికమకగా అడిగాడు " ఇంతకీ ఆ వడ్డాణం ఎవరికీ దక్కింది?"

" చచ్చిన చంద్రారావు అసలు భార్యకి..! ఆ తర్వాతెప్పటికోలే!".. "అసలు భార్యా ?... ఆమెవరు?"

" శ్రీలక్ష్మి. పతివ్రతలపాడు పక్కనే ఉన్న సీతాపురంలో ఇద్దరు పిల్లల్తో బిక్కుబిక్కుమంటూ బతుకీడ్చుకొస్తున్న దౌర్భాగ్యురాలు. ఆఫీసర్ ఐరావతం సెలవులో ఉన్నప్పుడు, ఆ మానేజరు తనెళ్ళి కేసును బాగా పరిశోధించి ఆమెను వెలుగు లోకి తీసుకొచ్చాడు."

" మరయితే చంద్రారావుకి చకోరి".. " సైడ్ డిష్ అంటే, ఉంపుడుకత్తె."... భూపతి తెల్లబోయాడు. " వ్వాట్! ఆడది ఎంతకి తగును!" అన్నాడు వెంటనే అడిగాడు , " ఇంతకీ వొడ్డాణం అసలెవరిది?"

" మీసాలప్పలసామి తాలూకు చచ్చిపోయిన భార్యకి, ఆమె మొదటి మొగుడు చేయించి పెట్టింది." " ఏంటీ, మీసాలప్పలసామికి చంద్రా రావు అసలు కొడుకేనా?"... " కాదు. అతని భార్యకు మొదటి మొగుడివల్ల కలిగిన కొడుకు. కాబట్టి చంద్రారావు తన తల్లి తాలూకా వొడ్డాణాన్ని, మారుటి తండ్రియిన మీసాలప్పలసామి నుంచి తెలివిగా చేజిక్కించుకున్నాడు. ఆ డబ్బుతో వ్యాపారం చెయ్యాలని ఆశపడ్డాడు. ఈ లోపల, ఆ వొడ్డాణం మీదా, ఇంకేదో తల్లివ్వగా అతని దగ్గరున్న చిన్నం చితకం మీదా కన్నేసిన మహంకాళి తన తాలూకు తిరుగుబోతు బంధువు చకోరిని తీసుకొచ్చి అతనికి తగిలించింది. ఆ మాయలో పడి, పెళ్ళాం పిల్లల్ని మరిచిపోయాడు చంద్రారావు.. ఇది బాబూ కథ. ఇట్లా ఉంటాయి కొన్ని గోల్డులోను కథలు... వెళ్ళు ఆ లెక్చరరుగారిని ఓ పది రోజులు పోయాక రమ్మని చెప్పు!"

తెల్లబోయి లేచాడు భూపతి, 'వారెవా, వొడ్డాణమా ఎంత కథ నడిపావే!" అనుకున్నాడు. అక్కడ్నించి కదలబోయాడు. హఠాత్తుగా అతని కింకో సందేహం వచ్చింది. టక్కున అడిగేశాడు." అవున్సార్. ఇంతకీ బాంకు రూల్సు కనుకూలంగా కథ సుఖాంతమే గదా! మీ రెందు కంత నీరసపడిపోయారు? . ఐరావతం తన్నులు తిన్నందుకా?"

మానేజర్ సింహశౌర్యం మరోసారి హఠాత్తుగా నీరసపడిపోయాడు. గాఢంగా నిట్టూర్చాడు. బేలగా దీనంగా చూశాడు. నూతిలోంచొస్తున్నట్టన్నాడు " ప్చ్! ఏంటో! తన్నులు తిన్నది ఐరావతం అని కదూ చెప్పాన్నీకు? కాదు బాబూ ఐరావతం కాదు మానేజర్! ఆ మానేజర్ ఎవరో తెల్సా? ఎవరో కాదు నాయనా నేనే! అంచేత బాబూ గోల్డులోను కేసంటే నాకు..."

నెల్రోజుల్లో తను కూడా ఓ బ్రాంచి మానేజరు కాబోతున్న విషయం జ్ఞాపకం వచ్చింది భూపతికి! టేబుల్ మీదున్న మంచినీళ్ల గ్లాసు దింపకుండా గడగడా తాగేసి ఒక్క ఊపుతో బయటికొచ్చి పడ్డాడు!

(ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక 16-4-86)

★ ★ ★ ★ ★ ★ ★ ★ ★